పుస్తకాల పేరుతో దండుకుంటున్నారు

బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు అనిల్‌కుమార్

వేములవాడ, జూన్ 7 : వేములవాడలోని ప్రైవేట్ విద్యాసంస్థలు పుస్తకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి నగదు దండుకుంటూ దోపిడీ పాల్పడుతున్నారని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు పోతు అనిల్ కుమార్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కొన్ని ప్రైవేట్ పాఠశాలలు పుస్తకాల పేరుతో రూ. 5 వేల నుంచి 12 వేల వరకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి దండుకుంటున్నాయని ఆరోపించారు. మరికొన్ని పాఠశాలలు బుక్ సెల్లర్స్‌తో కుమ్మక్కయి విక్రయాలు జరుపుతున్నారన్నారు. అనుమతి లేని పాఠశాలలు కూడా పుట్టగొడుగులా వచ్చాయని వాటన్నిటిపై దృష్టి సారించాల్సిన విద్యా శాఖ ఇంకా నిద్రమత్తులోనే ఉందని ఎద్దేవా చేశారు. జిల్లా యంత్రాంగం దృష్టి సారించి వెంటనే తనిఖీలు నిర్వహించి, తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుకుండా చూడాలని ఆయన కోరారు. అధికారులు నిర్లక్ష్యం చేస్తే తప్పనిసరిగా పెద్ద ఎత్తున ఆందోళన చేసి, విద్యార్థుల తల్లిదండ్రులకు బాసటగా నిలుస్తామని హెచ్చరించారు.

జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మోతీరామ్

రుద్రంగి, జూన్ 7: ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ మోతీరామ్ సూచించారు. శనివారం మండలంలోని మానాల, గిరిజనతండా గ్రామాల్లో ఎస్ఐ మోతిరాం జాతీయ లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజీ మార్గమే రాజ మార్గమన్నారు. రుద్రంగి పోలీస్ కోర్టు పరిధిలో ఉన్న పెండింగ్ కేసులో ఫిర్యాదు దారులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. దేగావత్‌తండా గ్రామంలో వీడీసీ సభ్యులు ఎస్ఐ మోతిరాంను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దేగావత్ తిరుపతి, మానాల, గిరిజనతండాల నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణ నిత్యాన్నసత్రం నిర్మాణానికి రూ. 5 లక్షల విరాళం

నిత్యాన్నసత్రం నిర్మాణానికి విరాళాన్ని అందజేస్తున్న మధు లక్ష్మి, కుటుంబసభ్యులు

వేములవాడ టౌన్, జూన్ 7 : వేములవాడ పట్టణంలోని బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం నిర్మాణానికి వేములవాడకు చెందిన ప్రముఖ స్వాతంత్రసమరయోధులు కీ.శే మధు గుండయ్య జ్ఞాపకార్థం వారి సతీమణి మధు లక్ష్మి, కుమారులు డాక్టర్ రాధాకిషన్, శ్రీనివాస్ రూ. 5 లక్షల విరాళాన్ని ట్రస్ట్ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణకు అందజేశారు. వారి కుటుంబానికి అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బుడెంగారి మహేశ్, పురాణం రాము, మామిడిపెల్లి వెంకటేశం, మధు రఘునందన్, రాగంపేట దేవేందర్, చెర్లపెల్లి సీతారాములు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడి కూతురికి అడ్మిషన్

జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో అడ్మిషన్ తీసుకుంటున్న ఉపాధ్యాయుడు

వేములవాడ, జూన్ 7 : వేములవాడ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు కిష్టయ్య తన కూతురు మధురిమను 9వ తరగతిలో చేర్పుతూ శనివారం అడ్మిషన్ తీసుకున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు నిర్వహించిన బడిబాటలో భాగంగా కథలాపూర్ మండలంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న కిష్టయ్య తన 9వ తరగతి చదువుతున్న కూతురు మధురిమను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, శభాష్ అనిపించుకున్నారు. ఈ సందర్భంగా సదరు ఉపాధ్యాయుడి మండల విద్యాధికారి, పాఠశాల హెచ్ఎం బన్నాజీ కూడా అభినందించారు. హెచ్ఎం బనానజీ, ఉపాధ్యాయులు హరికృష్ణ, కృష్ణ, బాలరాజు ఉన్నారు.

రాజన్న ఆలయ పర్యవేక్షకుడు గుండి మూర్తి మృతి

నర్సింహమూర్తి (ఫైల్)

వేములవాడ టౌన్,జూన్ 7: రాజన్న ఆలయంలో 20 ఏండ్లుగా పర్యవేక్షకుడిగా విధులు నిర్వర్తిస్తున్న గుండి నర్సింహమూర్తి (52) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. రెండేళ్ల క్రితం ఉగాది రోజున జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడ్డ మూర్తి చికిత్స పొందుతున్న క్రమంలో శనివారం మృతి చెందినట్లు బంధువులు వెల్లడించారు. మూర్తి మృతి తీరనిలోటని రాజన్న ఆలయ అధికారులు, బంధువులు అంటున్నారు. అతడి మృతికి ఈవో వినోద్‌రెడ్డి తమ సంతాపాన్ని తెలిపారు.

ఇల్లంతకుంట: ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ముస్తాబాద్ : మండల కేంద్రంలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

జిల్లా వ్యాప్తంగా శనివారం బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లిం మత పెద్దల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం బక్రీద్ పండుగ విశిష్టతను తెలిపారు. వివిధ పార్టీల నేతలు , పట్టణ ప్రముఖులు ఈద్గాల వద్ద పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



వేములవాడ టౌన్ : ఈద్గావద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఇల్లంతకుంట/రుద్రంగి/ముస్తాబాద్/గంభీరావుపేట/బోయినిపల్లి రూరల్/ కోనరావుపేట /వేములవాడ టౌన్, జూన్ 7: వేములవాడ పట్టణంలోని బక్రీద్ శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనల అనంతరం వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, అధికారులు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అక్రం, మసీద్ అధ్యక్షుడు షేక్ ఇమామ్, అబ్దుల్ రజాక్, సర్వర్‌పాషా, బషీర్, ముస్లిం నాయకులు పీర్ మహ్మద్, అంజద్‌పాషా, షేక్ ఇంతియాజ్, ఇష్తెఖార్ హుస్సేన్, అజ్మత్ అలీ, షాహిద్‌పాషా, తాహెర్‌పాషా, లాయక్‌పాషా, మన్నాన్, అహ్మద్‌పాషా, రసూల్, తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ అన్వేష్ అన్ని ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు కాకుండా పట్టణ సీఐ వీర ప్రసాద్ గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. కోనరావుపేట మండలవ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ నిర్వహించారు. బోయినిపల్లి రూరల్ మండలంలోని తడగొండ మసీద్‌లో ముస్లింలు నమాజ్ చేశారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని ఈద్గాలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేని పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ ఘనంగా నిర్వహించారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రుద్రంగి మండల కేంద్రంలోని ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి, ఎస్ఐ మోతిరామ్ హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలోని బిక్కవాగు ప్రాంతంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన అంతటి అనిల్ సింధూర్‌లో పాల్గొని విజయవంతంగా పాల్గొని సెలవుపై ఇంటికి రాగా, బక్రీద్ సందర్భంగా ఈద్గా వద్ద శాలువా కప్పి సన్మానించారు. అన్ని గ్రామాల ముస్లింలు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

చందుర్తి, జూన్ 7 : మూడపెల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన 2007-2008 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముందుగా తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించారు. అనంతరం ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఉపాధ్యాయులు గొర్రె దేవేందర్, జనపాల వెంకటయ్య, కనపర్తి శ్రీనివాస్, తుల శ్రీనివాస్‌రావు, కవిత, తిరుపతి, నీరటి శ్రీనివాస్, అటెండర్ నాజర్ విద్యార్థులు ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

వేములవాడ అగ్నిమాపక కేంద్రంలో యోగ శిక్షణ అందిస్తున్న శిక్షకుడు కృష్ణ

వేములవాడ, జూన్ 7: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంటుందని అగ్నిమాపక అధికారి అనిల్ కుమార్ సూచించారు. శనివారం వేములవాడ అగ్నిమాపక కేంద్రంలో యోగా దినోత్సవ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆయూష్ విభాగం యోగా శిక్షకులు ఎలిగేటి కృష్ణ, రిషిక శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుతున్న కాలంతో పాటు వచ్చే వ్యాధులు, మానసిక ఒత్తిడిని తట్టుకునేందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. తప్పని సరిగా యోగా శిక్షణ పొంది ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది రాజేంద్ర ప్రసాద్, సాయి, దుర్గారాజ్, మహేశ్, చంద్రశేఖర్, శంకర్, తిరుపతి, ఆశ కార్యకర్త జేయశీల, లత, హేమలత, ఉమా, విజయ, కాలనీవాసులు ఉన్నారు.

పసరు మందే ప్రాణాంతకమైందా..?

- నురుగు కక్కుకొని మహిళ మృతి
- అనుమానాస్పద మృతిగా ఫిర్యాదు
- ఎల్లారెడ్డిపేటలో ఘటన

లళిత (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్ 7: ఏండ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ నాటు వైద్యం చేయించుకునే క్రమంలో తీసుకున్న పసరు మందు ప్రాణం మీదికి తెచ్చిందని మృతురాలి కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నేవూరి లళిత (56) 20 ఏండ్ల నుంచి షుగర్, హైబీపీతో బాధపడుతుంది. ఎన్ని హాస్పిటల్స్ తిరిగి చికిత్స చేయించుకున్నా తగ్గముఖం పట్టకపోగా ఆరోగ్య పరిస్థితి మెరుగపడకపోవడంతో నాటు వైద్యులను సంప్రదించగా, వారు అందించిన గోలీలు శుక్రవారం రాత్రి 9 గంటలకు తీసుకొని ఇంట్లో పడుకుంది. ఎంతసేపటికీ లేవక పోవడంతో ఆమె కుమారుడు కల్యాణ్ వచ్చి చూసేసరికి నోట్లో నుంచి నురగకక్కుతున్నట్లు గమనించాడు. వెంటనే చికిత్స కోసం సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లడంతో వైద్యులు అప్పటికే మృతి చెం దినట్లు తెలిపారు. ఈ మేరకు మృతురాలి కుమారుడు పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

బస్సు, ఆటో ఢీ.. ఒకరికి గాయాలు

వీర్నపల్లి , జూన్7: ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ కమటం నర్సయ్య తన ఆటోలో వీర్నపల్లి నుంచి రంగంపేట వైపు వెళ్తున్నాడు. సబ్ స్టేషన్ మూల మలుపు వద్ద వన్ పల్లి నుంచి సిరిసిల్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొట్టింది.

ఈ ఘటనలో నర్సయ్యకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108లో ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

బడిబాట భవితకు బంగారుబాట

ఇల్లంతకుంట : ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

ఇల్లంతకుంట, జూన్ 7 : బడి బాట భవితకు బంగారు బాట అని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత అన్నారు. శనివారం మండల కేంద్రం తోపాటు జంగంరెడ్డి పల్లి, తిప్పాపూర్, వెంకట్రావుపల్లి, ముస్కానిపేట, వంతబుపుల, ఓగులాపూర్, సోమవారంపేట, గొల్లపల్లి గ్రామాలలో బడి బాట కార్యక్రమం ద్వారా గ్రామాలలో ంటింటా తిరిగి విద్యార్థుల అడ్మిషన్లు చేశామన్నారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ బడి బాట కార్యక్రమంలో మండల కేంద్రంలో విద్యార్థులు ఉపాధ్యాయులు ర్యాలి నిర్వహించారు. విద్యార్థుల తల్లితండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించకుండా గ్రామాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు. కార్పోరేట్ స్కూల్ స్థాయిలో విద్యా బోధన గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలలో ఉపాధ్యాయులు చెబుతున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే వస్తాయని వాటిని అవకాశం ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ముస్తాబాద్ : మోహినికుంటలో ..

ముస్తాబాద్, జూన్ 7 : ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ- మనందరి బాధ్యతగా గుర్తించి ప్రతి పిల్లోన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, రైతుబంధు మాజీ అధక్షుడు బీఆర్ఎస్ సినియర్ నాయకుడు కల్వకుంట్ల గోపాల్‌రావు చిన్నారుల తల్లిదండ్రులకు స్థానిక ప్రజలకు పిలుపునిచ్చారు. మండంలోని మోహినికుంటలో విద్యాశాఖ ఆదేశాల ప్రకారం.. శనివారం ఉపాధ్యాయులు నిర్వహించిన బడిబాటలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రావు, శోభ ఉపాధ్యాయులు దేవేందర్ రావు, గిరీష, శేఖర్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట, జూన్ 7: సర్కారు బడిలో నాణ్యమైన విద్య అందుతోందని ఎంఈవో జీ కృష్ణహరి తెలిపారు. శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో బోధన జరుగుతున్నందున విద్యార్థులకు మెరుగైన విద్య అందుతోందని తెలిపారు. ఈ సందర్భంగా రాజన్నపేట, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, తదితర గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఔదార్యం

మమతకు బట్టలతో పాటు బంగారు ఉంగరాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ సతీమణి దీవెన

చొప్పదండి, జూన్ 7: మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన అనాథ యువతి మమత పెండ్లి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కానుకలు పంపించి ఔదార్యాన్ని చాటుకున్నారు. తన సతీమణి దీవెన ద్వారా చీరెతో పాటు బంగారు ఉంగరం అందజేశారు. కాట్నపల్లి గ్రామానికి చెందిన సమత, మమతల తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతిచెందగా అనాథలయ్యారు. ఆ సమయంలో ఎమ్మెల్యేగా ఉన్న సుంకె రవిశంకర్ వారికి ఆర్థిక సాయం అందించడంతోపాటు మమతకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా కృషి చేశారు. ప్రతి దసరాకు సమత, మమతను ఇంటికి ఆహ్వానించి, కొత్త బట్టలు పెట్టి వారి ఆలనపాలన చూసుకుంటూ వస్తున్నారు. మమత పెండ్లి ఆదివారం నిశ్చయించగా, మాజీ ఎమ్మెల్యే సతీమణి దీవెన శనివారం మమతను పెండ్లి కూతురిని చేసి చీరెతో పాటు బంగారు ఉంగరం కానుకగా అందించారు. సమత, మమతకు అండగా ఉంటున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

అదుపుతప్పి రొటోవేటర్‌లో పడిన రైతు

కరీంనగర్ రూరల్, జూన్ 7: నారుమడి కోసం పొలం దున్నుతున్న ఓ రైతు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ రొటోవేటర్‌లో పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్ గ్రామానికి చెందిన చిట్కూరి అజయ్‌కుమార్(20) శనివారం ఇరుకుల్ల శివారులోని నారుమడి కోసం ట్రాక్టర్ రొటోవేటర్‌తో పొలం దున్నుతున్నాడు. పొలం దున్నే క్రమంలో ట్రాక్టర్‌కు అడ్డుగా ఉన్న డ్రిప్ పైపులను కాలుతో తప్పించే క్రమంలో అదుపుతప్పి రొటోవేటర్‌లో పడిపోయాడు, వెంటనే అప్రమత్తమైన స్థానిక రైతులు రొటోవేటర్‌ను ఆపి, అందులో ఇరుకున్న అజయ్‌కుమార్‌ను దాదాపు గంటపాటు శ్రమించి బయటకు తీశారు. తీవ్ర గాయాలపాలైన అతడిని చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. ఈ ప్రమాదంలో ఎడమకాలు మోకాలు వరకు తెగిపోగా, కుడికాలు, చేయి, విరిగిపోయిందని, వైద్యులు చికిత్స చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

బాధిత కుటుంబానికి తుల ఉమ పరామర్శ

నరసింహారావు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న తుల ఉమ

గంభీరావుపేట, జూన్ 7 : మండలంలోని దమ్మన్నపేటలో తుల నరసింహారావు బాధిత కుటుంబాన్ని శనివారం కరీంనగర్ జడ్పీ మాజీ చైర్ పర్సన్ తుల ఉమ పరామర్శించారు. నరసింహారావు గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తుల ఉమ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట బీఆర్ఎస్ నేతలు వేణు, హన్మంతరెడ్డి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

ముస్తాబాద్, జూన్ 7 : అప్పుల బాధతో ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. హైదరాబాద్ రాజేంద్రనగర్‌కు చెందిన పెరుమండ్ల కృష్ణ (50) ఇక్కడి ప్రాంతం ఆమ్మాయి లక్ష్మీతో వివాహం జరుగగా, 25 ఏండ్ల క్రితం ముస్తాబాద్‌కు వచ్చి ఇక్కడే స్థిర పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇక్కడ మేస్త్రీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుటున్నట్లు 4 ఏండ్ల క్రితం పెద్ద కుమార్తె వివాహానికి రూ. 4 లక్షల వరకు అప్పు అయినట్లు ఇటీవల బైక్ ప్రమాదంలో తీవ్రగాయాలు కాగా, చికిత్స కోసం అయిన ఖర్చులు, ఇటీవల పనులు సరిగా లేక పోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలనే దిగులుతో కొన్ని రోజులుగా మనసిక వేదన పడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం ఉదయం రోజువారీగా ఉదయం ఇంటి నుంచి వెళ్లి తెర్లుమద్ది క్రాసింగ్ వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గణేశ్ తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఇన్నారు.

కోడెల అక్రమ రవాణాపై విచారణ జరిపించాలి

సీఐకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

వేములవాడ, జూన్ 7 : వధశాలకు కోడెలను అక్రమంగా తరలించిన వ్యవహారంలో చట్టప్రకారం చర్యలు తీసుకునేలా విచారణ జరిపించాలని శనివారం వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్‌కు హిం దూ సంఘాల నాయకులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సుభాష్‌నగర్‌లో శుక్రవారం రాత్రి వధశాలకు ఆరు కోడేలు తీసుకరాగా రెండింటిని మాత్రమే కాపాడామని మిగిలిన నాలుగు ఎక్కడి నుంచి వచ్చాయి ఎలా రవాణా జరిగిందని, వారిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. హిందూ సంఘాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు. రేగుల సంతోష్ బాబు, గడప కిశోర్ రావు, నాగుల రాము గౌడ్, రేగుల రాజ్ కుమార్, లక్ష్మణ్, మైలారం శ్రీనివాస్, నందగిరి రాహుల్, వెంకటేశ్ ఉన్నారు.

పండుగ పూట బండపల్లిలో స్థల వివాదం

స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

చందుర్తి,జూన్ 7 : బక్రీద్‌ను ముస్లింలు ఆనందోత్సవాల మధ్య జరుపుకుంటున్న సమయంలో, తమ పట్టా భూమిలో ఆక్రమంగా ముసింలు ప్రార్థనలు చేస్తున్నారని మండలంలోని బండపల్లికి చెందిన ఓ యువకుడు శనివారం 100కు డయల్ చేశాడు. రెండు కులాల మధ్య వివాదమని భావించిన పోలీసులు తక్షణమే స్పందించి సంఘటనా స్థలానికి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రమేశ్ చేరుకొని విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. చందుర్తి, కోనరావుపేట మండలాల సరిహద్దు ప్రాంతంలోని బండపల్లి- బావుసాయిపేట గ్రామాల మధ్య ముస్లింలు మసీదు నిర్మాణం కోసం 1987లో బండపల్లికి చెందిన గడ్డం రాఘవరెడ్డి వద్ద బండపల్లి గ్రామానికి చెందిన నన్నుసాబ్, రంజాన్ అలీలు కలిసి 0.08 గుంటల స్థలాన్ని అప్పుడు రూ.3 వేల కొనుగోలు చేశారని, అప్పటి నుంచి ఈ స్థలం మసీదు కోసమే వినియోగించుకుంటున్నామన్నారు. విక్రయదారుడు మృతి చెందడంతో ఈ భూమి పట్టామార్పిడి జరిగిందని, దాని పట్టా కోసం పట్టాదారురాలు గడ్డం అంతవ్వను పలుమార్లు అడిగితే తమ కుమారులు గల్ఫ్ నుంచి రాగానే పట్టా చెప్తామంటూ దాట వేసుకు వచ్చారని సీఐ, ఎస్ఐలకు బాధితులు వివరించారు. దీంతో పోలీసులు డయల్ 100కు కాల్ చేసిన కరుణాకర్ పట్టాదారు పాసు పుస్తకం తీసుకొని ఠాణా వచ్చి సమస్య పరిష్కారం చేసుకోవాలని ఎస్ఐ ఆదేశించారు, బక్రీద్ పండుగ రోజున వివాదం తలెత్తడంతో పోలీసులు దీనిని తీవ్రంగా పరిగణించి బండపల్లిలో సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. సాయంత్రం వరకు పోలీసుల గ్రామంలో పందోబస్తు ఏర్పాటు చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788.
NT-325337-All

CHANGE OF NAME

★I, PALSANI SRUJANA, D/o. NALLA SUDHAKAR REDDY, H.No. 3-85, LASMANNAPALLY, VENNAMPALLI, SAIDAPUR, KARIMNAGAR, HAVE CHANGED MY NAME AS "NALLA SRUJANA" D/o. NALLA SUDHAKAR REDDY. FOR ALL PURPOSE.
NTK-000

FINANCE

★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468.
NT-350515-All

FOR LEASE

★Available 2 Plots for Lease, 1000 Sq.yards each side by side East & West Facing at Garden Retreat - Mulugu 0.5 Km from Rajiv Rahadhari /Manchirial Highway for Godowns. Interested Contact: 9849014717.
NT-342982

CHANGE OF NAME

★I, LINGALA MANEMMA, W/o. Ramaiah, R/o. H.No. 5-2, Narayanapur (V), Yellareddypet (M), Rajanna Sircilla Dist., T.G. My Name was wrongly mentioned as MANAVVA SININGU in my Pension Scheme. My Original Name as LINGALA MANEMMA, W/o. Ramaiah is true & correct as per my Aadhar Card, PAN Card & Bank Pass Book, have Changed My Name as LINGALA MANEMMA, W/o. Ramaiah.
NT-Venkat

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189